● న్యూజెర్సీ కథల పోటీలో 150/- లు బహుమతి పొందిన కథ

# రాతివనం

—సలీం



పక్క గదిలోంచి పదిహేనేళ్ళ వంశోద్ధారకుడి గొంతు తారస్థాయిలో విన్పిస్తోంది.

"వంద రూపాయలు అర్జెంట్‌గా కావాలి మమ్మీ"

అంటున్నాడు వాడు.

"అంత డబ్బు నీకెందుకురా?" అరుస్తున్నట్లే మాట్లాడుతోంది శ్రీమతి.

"ఎందుకంటే ఏంచెప్పను? నాకవసరం అంతే" మొండిగా ఖరాఖండిగా చెప్తున్నాడు.

నేను రంగప్రవేశం చేయక తప్పదనిపించింది.

చాలా ప్రశాంతంగా ఇద్దరి దగ్గిరకూ నడిచి, శ్రీమతి పక్కనెళ్ళి నిలబడ్డాను.

"నీ ఎదురుగానే ఉన్నారుగా. నాన్నగారినే అడుగు" అంది తను.

"ఆయనకు విన్పించేట్లే ఇందాకట్నుంచీ అడుగుతున్నాగా" అన్నాడు మా వంశాంకురం - నావైపు నిరసన చూపొకటి చూసి.

గుండెల్లో ముల్లులా గుచ్చుకుందా చూపు.....

అయినా సౌమ్యంగా "ఎందుకో మాకు చెప్పకూడని విషయమా" అన్నాను కావాలనే వ్యంగ్యంగా.....

వాడు నావైపోసారీ - వాళ్ళ అమ్మవైపోసారీ మార్చిమార్చి చూశాడు.

"ఏనాటికైనా మీకు తెలియాల్సిన విషయమే కదా. నాగుండెల్లో అగ్నిగుండంలా మండుతోన్న ఈ నిజం బైటపడక మానుతుందా - పాతకాలం నాటి, తుప్పపట్టిన మీ ఛాందస భావాల్ని మసి చేయక మానుతుందా"

నాకు క్షణం కళ్ళుతిరిగాయి. వృత్తిరీత్యా లాయర్‌నైన నేను "మండేనిజం"లాంటి పదాల్ని మచ్చుకైనా తట్టుకోలేను.

అర్ధాంగివైపు చూశాను. ఆవిడ ఆశ్చర్యంతో - బొమ్మలా - వాడివైపే చూస్తోంది - అనిమీలిత నేత్రియై.

"ఏవిట్రా - నువ్వు మాకు పుట్టలేదని ఏ అడ్డమైన వెధవైనా కూశాడా" అన్నాను.

"అవన్నీ పాత సినిమాల్లోని అరిగిపోయిన సెంటిమెంట్స్ డాడీ. నాకు డబ్బుకావాలి. నాకిష్టమైన, ప్రియమైన శైలజ బర్త్‌డే రేపు. ప్రజంటేషన్ కొనాలి".

"ప్రియమైన శైలజ" అని పలికేటపుడు వాడి కళ్ళు అరమోడ్పులయ్యాయి - పరమాత్మ సాక్షాత్కారంతో ఆత్మచెందే అనుభూతి పొందుతున్నట్లు.

"శైలజ ఎవ్రరా?"

"ఎవరని చెప్పను డాడీ - నా జీవన వనంలోకి కాలూనిన ఆమని అని చెప్పనా - నిబిడాంధకారం లాంటి నా జీవితంలో తటిల్లతలా విరిసిన అద్భుతమైన ఓ మెరుపు పూవని చెప్పనా - నా హృది వీణను మధురంగా మీటుతున్న మహా వైణికురాలని చెప్పనా - నా ప్రాణమనీ - శ్వాస అనీ - సర్వస్వమనీ - ......"

"కవిత్వం కాదురా - ఎవరా అమ్మాయి"

"కవిత్వమా - మీకు కవిత్వంలా విన్పిస్తూందా - కాదు డాడీ - నా హృదంతరాళాల్లోంచి ఉబికి వస్తున్న నిజాల నిర్నిద్రగానాలు - నీరవ నిశ్శబ్ద నిశీధిలో ఆకాశం మీంచి అలవోకగా నా గుండెల మీద తొణికిన తుహిన కణం లాంటి ఆమె ప్రేమ నాకు . దేవుడు ప్రసాదించిన అపురూపమైన వరం."

తీయని కలకంటున్నట్లు కళ్ళు మూసుకుని మరీ చెప్తున్నాడు వాడు.

నా మెదడులోంచి మిస్సైల్స్ దూసుకుపోతున్నట్లు - శతఘ్నులు ఫెటేల్మని పేలుతున్నట్లు - ఆసరా కోసం మా ఆవిడ భుజాన్ని పట్టుకున్నాను.

"ప్రేమా-నీ వయసుకి ప్రేమ ఏవిట్రా" శక్తిని కూడదీసుకుని అడిగాను. అగాధంలోంచి వస్తున్నట్లు బలహీనమైన నాగొంతు -

"ప్రేమకు వయసుతో పనేమిటి డాడీ - మా ప్రేమ ఈ తుచ్ఛమైన నిగళాలను ఏనాడో తెంపుకుని విశాలాకాశంలో విహంగంలా విహరిస్తోంది. మా ప్రేమ పవిత్రమైనది. అనిర్వచనీయమైనది. అజరామరమైనది."

"నోర్మూయ్ - ఏవిటా వాగుడు" భార్యామణి కసిరింది. ఆవిడ భుజం నా చేతి కింద సన్నగా వణకటం నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

"నాకు తెలుసు మమ్మీ మీరిలా మా ప్రేమని నిరాకరిస్తారనీ - దాన్ని త్రుంచేసే ప్రయత్నం చేస్తారనీ - తరతరాలుగా చరిత్ర చెప్తున్న నిజం యిదే. నేను చెప్పేది కూడా మీరు జాగ్రత్తగా వినండి. ప్రపంచం అంతా ఒక్కటై నిలిచినా - హరిహరాదులడ్డొచ్చినా - మమ్మల్ని విడదీయలేరు మమ్మీ - మా హృదయాలు ఏనాడో కలిశాయి - మా శరీరాలు ......."

"ఆపురా" నీర్సంగా అనేసి అక్కడే కూలబడిపోయాను.

"నన్నాపకండి. చెప్పనివ్వండి. మా శరీరాలు విడిపోయినా మా ఆత్మల్ని మీరు విడదీయలేరు".

"హమ్మయ్య - ఎంత భయపడి చచ్చానో - శరీరాలు కూడా కలిశాయంటాడేమోనని - కొద్దిగా

ఓపిక వచ్చింది. లేచి నిలబడపోయాను.

'శైలజ నాన్నగారు - అదే, నా కాబోయే మామగారు - తన కూతురు ఓ ప్లీడర్ కొడుకుని ప్రేమించడం కంఠంలో ప్రాణం ఉండగా ఒప్పుకోరని తెలుసు. ఆయన జడ్జిగారు కదా - అయినా సరే.... నేను శైలజనే భార్యగా పొంది తీరుతాను''

నాకు ''జడ్జిగార''నే పదం విన్నప్పుడే స్పృహతప్పింది.

* * * * *

రాత్రంతా ఆలోచనలతో నిద్రలేని నాకు ఉదయం వాడు స్కూలుకు వెళ్తున్నప్పుడు నడిచిన నడక చూసి చప్పున స్ఫురించింది. ఆ నడక ఎక్కడో చూసినట్లు. ఓ అరగంట బుర్ర బద్దలు కొట్టుకున్నాక గుర్తొచ్చింది. అది ఓ తెలుగు సినిమాలో ఓ కుర్ర హీరో నడక అవి.

చాలా రోజులైంది తెలుగు సినిమాలు చూసి —

వరుసగా మూడు రోజులు మూడు సినిమాలు చూశాను - అన్నీ ఆ హీరో నటించిన తెలుగు సినిమాలే.

ఒక దాంట్లో ఆ హీరో ఓ ఫ్యాక్టరీలో కార్మికుడు. తన ఫ్యాక్టరీ యజమాని కూతుర్ని ప్రేమిస్తాడు. అన్ని అడ్డంకులూ అధిగమించి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. మరో సినిమాలో ఓ ఖైదీని జైలర్ కూతురు ప్రేమిస్తుంది.
ఇంకో సినిమాలో ఓ పాలేరు భూస్వామి కూతుర్ని ప్రేమిస్తాడు. ఈ మూడు సినిమాల్లో కూడా హీరో వయసు పదిహేడు - హీరోయిన్ వయసు పదహారు అని చెప్పడానికి పాటలో - మాటలో - సింబాలిక్ షాట్స్ ఉన్నాయి. అన్నిట్లోనూ దాదాపు మా పుత్రరత్నం మాట్లాడిన డైలాగ్సే ఉన్నాయి.

ఇకనుంచి వీడిని తెలుగు సినిమాలు చూడకుండా కట్టుదిట్టం చేయాలని నిర్ణయించుకున్నాను.

భోజనాలయాక శ్రీమతి టీవీ పెడితే చూస్తూ కూచున్నాను. ''చాలా మంచి నాటకం ఉందండీ ఇపుడు'' అంటూ శ్రీమతి పక్కన వచ్చికూచుంది. నాటకం ప్రారంభమైంది. అందులో హీరో రిక్షా తొక్కుతుంటాడు. రోజూ తన రిక్షాలోనే తాసిల్దారుగారి అమ్మాయిని కాలేజీకి తీసుకెళ్తుంటాడు. వాళ్ళ మధ్య ప్రేమ చిగురిస్తుంది.
''రోష్నీ - క్షితిజం దగ్గిర నింగీ నేలా సంగమంలా మన కలయిక చాలా అపురూపమైనది.'' అంటున్నాడు హీరో రిక్షా పెడల్ మీద ఓ కాలు, నేల మీద ఓ కాలు పెట్టి. వాడికింకా మీసాలు కూడా సరిగా వచ్చినట్టు లేదు. నాకు కొద్దిగా కళ్ళు తిరిగాయి.

వెంటనే లేచి వెళ్లి టీవీ ఆపేశాను, రేపు దీన్ని తప్పకుండా సగం రేటుకైనా సరే అమ్మేయాలని నిర్ణయించుకుని.

పడక మీద మేను వాల్చాను ఏమీ తోచక. పక్కనే ఉన్న తెలుగుపత్రిక ఒకటి చేతిలోకి తీసుకున్నాను. యధాలాపంగా ఓ కథ తిరగేశాను. ఆ కథలో హీరో ఓ కాలేజీలో ప్యూను. కాలేజీ ప్రిన్సిపాల్ కూతుర్ని ప్రేమిస్తుంటాడు. ఓ రోజు పార్కులో ఆమె చేయి పట్టుకుని ''ప్రియా - నీ ప్రేమామృతాన్ని గ్రోలి పరవశించిన నా మది గండుతుమ్మెదలా ఝుమ్మని నాట్యం చేస్తోంది. నీ వలపు తలపుకు - ఓ తీయటి పిలుపుకు - నా తనువు ఝల్లుమని... ''

• నాకేమీ కన్పించటం లేదు - ఏమీ విన్పించటం లేదు. బహుశా స్పృహ తప్పి ఉంటుంది. ●


స్వచ్ఛమైన ముఖ వన్నె కోసం మీరు కనే కలలు పండే సమయం వచ్చింది!



అక్నిల్

పింపుల్ కేర్ సబ్బు

● అక్నిల్ — చర్మ విశేషజ్ఞుడి ద్వారా ప్రత్యేకంగా తయారు చేయబడినది.
● అక్నిల్ ప్రత్యేకమైన 7.6 pH ఫార్ములా కల్గినది. ● అక్నిల్ చర్మమును శుభ్రపర్చే విశిష్ట సబ్బు, అనవసరమైన నూనెను పీల్చివేస్తుంది. చర్మ రంధ్రాలు మూసికొని పోకుండా వుంచుతుంది. జిడ్డుదనాన్ని తగ్గించి చర్మాన్ని తేటగా, తాజాగా వుంచుతుంది. ● ముఖంపై వున్న మొటిమలను అగుపించకుండా చేస్తుంది, అవి ఎండిపోయేలా చేస్తుంది. క్రొత్త మొటిమలను రానివ్వదు. నల్ల మచ్చలను తొలగించి చర్మాన్ని స్వఛ్ఛపరుస్తుంది. ప్రతి రోజూ రెండుమార్లు దీనితో ముఖం కడుక్కోండి. ఎంత అందమైన వ్యత్యాసం కనిపిస్తుందో మీరే చూడండి.




మార్క్ ఎంటర్ప్రైసెస్ ఉత్పాదన పోస్ట్ బ్యాగ్ నం. 14501, బొంబాయి 400 008.

సూపర్ స్టాకిస్ట్: భూపేంద్ర ఏజన్సీస్ సుల్తాన్ బజార్, హైద్రాబాద్, టెలిఫోన్: నెం.: 551173 స్టాకిస్టులు: ● జ్యోతి మెడికల్ హాల్ సికింద్రాబాద్/హైద్రాబాద్
● వాసు మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ విజయవాడ-1. టెలిఫోన్ నెం.: 67275 ● శ్రీ సాయిలక్ష్మి ఏజన్సీస్ రాజమండ్రి, టెలిఫోన్: నెం.: 74744 ● శ్రీనివాస మెడికల్ హాల్ రాజమండ్రి
● రాజా ఏజన్సీస్ ఏలూరు, టెలిఫోన్ నెం.: 21602 ● శ్రీనివాస మెడికల్ హాల్ కాకినాడ టెలిఫోన్ నెం.: 74007 ● వెంకన్న ఏజన్సీస్ డాబా గార్డెన్స్ విశాఖపట్నం టెలిఫోన్ నెం.: 61902